క్లుప్తంగా

నేడు వైద్య శిబిరం

చాపాడు: మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నగురవళూరు గ్రామ సచివాలయం వద్ద శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తామని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలంతోపాటు మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న వీఆర్ఏలకు గ్రేడ్ 2 వీఆర్‌ఓలుగా ప్రమోషన్ పొందిన 18 మందికి ప్రొబేషన్ డిక్లరేషన్ అయింది. ఈ సందర్భంగా వీరు శుక్రవారం తహసీల్దార్ నజీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యలను కలిసి సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వీఆర్‌ఏలను వీఆర్ఓ–2లుగా ప్రమోషన్ ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గత నవంబర్ 12 నుంచి ఇప్పటి వరకు అరియర్స్‌ను కూడా ప్రభుత్వం చెల్లించిందని వారు చెప్పారు.

రేపు బైక్ ర్యాలీ

ప్రొద్దుటూరు కల్చరల్ : హనుమత్ జయంతి సందర్భంగా ఆదివారం విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు శ్రీకృష్ణ గీతాశ్రమం నుంచి ర్యాలీ ప్రారంభమై, టూటౌన్ పోలిస్‌స్టేషన్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. ర్యాలీలో హిందువులు, దేవాలయాల కమిటీ సభ్యులు, భజన సంఘాల ప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు యోగా



రాజుపాళెం గ్రంథాలయంలో యోగా చేస్తున్న విద్యార్థులు

రాజుపాళెం : సమ్మర్ క్యాంప్‌లో భాగంగా రాజుపాళెంలోని గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు యోగా చేయడం వల్ల మనసు నిశ్చలంగా ఉండి ఏ విషయం అయినా త్వరగా గ్రహించే శక్తి కలుగుతుందన్నారు. విద్యార్థులకు ఆటలు, పుస్తకపఠనం, పద్యాలు చదవడం నేర్పించామని గ్రంథాలయ అధికారి ప్రతాపుడు పేర్కొన్నారు.

ఆర్థిక సహాయం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మన ప్రజా సేవా సమితి కార్యాలయంలో శుక్రవారం శ్రీనివాసనగర్‌కు చెందిన నిరుపేద యువతి ఇమాంబి పెళ్లి ఖర్చులకు గాను ఆమె తల్లికి రూ.20వేలు, చీరను అందచేశారు. ఈ సందర్భంగా మనప్రజా సేవాసమితి అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ నిరుపేదలను తనవంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో వారికి సహకరించినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు వీఎస్ ముక్తియార్, సీఎం సురేష్‌నాయుడు, మనప్రజాసేవాసమితి ఉపాధ్యక్షుడు షేక్‌సలీం, ప్రధాన కార్యదర్శి హరి యాదవ్, మహమూద్, షేక్‌నూర్, జహీర్ పాల్గొన్నారు.

నర్సుల సేవలు ఎనలేనివి



బ్లెస్ట్ బ్రయాన్ ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న నర్సులు

బద్వేలు : నర్సులు రోగులకు, సమాజానికి చేస్తున్న సేవలు ఎనలేనివని రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పోరుమామిళ్ల పట్టణంలోని బ్లెస్ట్ బ్రయాన్ ఆసుపత్రిలో ఆసుపత్రి నిర్వాహకులు చిత్తా గిరిప్రణీత్‌రెడ్డిలు నర్సులతో కేక్ కట్ చేయించి నర్సులకు శుభాకాంక్షలు తెలిపారు. రోగులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమలో ఓఎల్ఎఫ్ హెచ్ఎం ఆరోగ్యరాణి, సంస్థ ప్రతినిధులు ప్రజ్వలరెడ్డి, ఎంపీటీసీ మహబూబ్‌పీరా, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..



నర్సింగ్ డేని జరుపుకుంటున్న నర్సులు

పోరుమామిళ్ల : స్థానిక 50 పడకల ఆసుపత్రిలో ఇంటర్నేషనల్ నర్సింగ్ డేని వైద్యసిబ్బంది శుక్రవారం కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించుకున్నారు. అలాగే టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ స్టాఫ్ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.

అన్నివర్గాల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను ప్రజలకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. 17వ వార్డులోని శ్రీకృష్ణ దేవరాయనగర్‌లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వార్డులోని ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఏ ఒక్క సంక్షేమ పథకంలో కోత విధించకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని అమలు చేయడంతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తూ పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.130 కోట్లు మంజూరు చేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ ఈగయద్దారెడ్డి, వార్డు కౌన్సిలర్ దుద్దుకూరి సత్యనారాయణ, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు గురివిరెడ్డి, సరిటాల మౌలాలి, బుజ్జి, శ్రీనివాసులు మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, డీఈ సుమన్‌రెడ్డి, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాశినాయనలో..

కాశినాయన : మండలంలోని వంకమర్రి గ్రామంలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందుతుందని మహిళలు తెలిపారు. అందరి మేలు కోరుతున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్, ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, పంచాయతీ సెక్రటరీ కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రత్యూష, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గురివిరెడ్డి, రమణారెడ్డి, గురయ్య, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సెలవుల్లో ఊరెళుతున్నారా.. జాగ్రత్త!

- చోరీలు జరగకుండా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఉపయోగించుకోండి
- ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్



ప్రొద్దుటూరు క్రైం : విద్యాసంస్థలకు వేసవి సెలవులు ఇచ్చారు. దీంతో చాలా మంది సొంతూళ్లకు, విహార యాత్రలకు వెళ్తుంటారు. అవసరాలు ఏవైనా సరే ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తమకు సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రొద్దుటూరు పోలీసులు కోరుతున్నారు. నాలుగైదు రోజులు తాళం వేసి వెళ్లడం వల్ల చోరీలు జరిగే అవకాశం ఉందని పోలీసులు అంటున్నారు. పోలీసుశాఖ అందుబాటులోకి తెచ్చిన ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఉపయోగించుకొని చోరీలు నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ కోరుతున్నారు. ఊళ్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇస్తే లాక్డ్‌హౌస్‌మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌తో పని చేసే నిఘా కెమెరాను ఇంట్లో ఉంచుతామని వివరించారు. ఈ మేరకు శుక్రవారం ఏఎస్పీ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో పని చేసే నిఘా కెమెరాలను ఇళ్లలో ఏర్పాటు చేయడం ద్వారా గతంలో ప్రొద్దుటూరుతో పాటు జిల్లాలో దొంగలను పట్టుకున్నామని పేర్కొన్నారు. ఇతర ఊళ్లకు వెళ్లే ఒక రోజు ముందు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే నిఘా కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఊళ్లకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే వరకు కెమెరా ఉంచిన ఇళ్లు పూర్తిగా పోలీసు పర్యవేక్షణలో ఉంటుందని ఏఎస్పీ పేర్కొన్నారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ సేవల కోసం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గానీ లేక ప్రొద్దుటూరు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని 9121100702 అనే సెల్‌నంబర్‌కు ఫోన్ చేసి పోలీసు సేవలను పొందవచ్చని తెలిపారు.

కుటుంబ డాక్టర్ విధానాన్ని ఉపయోగించుకోవాలి



నీటి తొట్టిని పరిశీలిస్తున్న డాక్టర్, వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : కుటుంబ డాక్టర్ విధానాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సోములవారిపల్లె 4వ సచివాలయం పరిధిలోని పెన్నానగర్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు ఇస్తున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్, క్యాన్సర్, గుండె సంబంధిత జబ్బులకు ఉచితంగా పరీక్షలు చేస్తామని, గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు, మంచానికే పరిమితమైన వారి ఇంటి వద్దకే వైద్యం అందిస్తామని పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బందితో కలసి ఆయన వీధుల్లో తిరిగి ప్రజలకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, సుబ్బయ్య, సీహెచ్‌ఓ నరసింహా, ఆరోగ్య కార్యకర్త దీప, ఆశా కార్యకర్తలు పోలమ్మ, అనురాధ, మేరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గం పరిధిలోని ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ పనుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ విజయకుమార్‌రెడ్డి, ఏఈఈ వెంకటమహేష్‌లు తెలిపారు. టేకూరుపేట, బి.కోడూరు, తిప్పరాజుపల్లె, పాయలకుంట్ల సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గృహ, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

నేడు తల్లులకు పాదపూజ

పోరుమామిళ్ల : మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం తల్లులకు వారి బిడ్డలచే పట్టణంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పాదపూజా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ అధ్యక్షుడు తులసి సురేష్ తెలిపారు. తల్లులను తీసుకుని బిడ్డలు ఆదివారం ఉదయం 8 గంటలకు దేవస్థానానికి రావాలని ఆయన కోరారు.

రైతుల ఇంట నెలకొంటున్న ఆనందాలు



జలకళ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పీడీ యదుభూషణ్‌రెడ్డి

బద్వేలు : వైఎస్సార్ జలకళతో పేద రైతుల ఇంట ఆనందాలు నెలకొంటున్నాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పోరుమామిళ్ల ఎంపీడీఓ కార్యాలయ సముదాయంలో జలకళ మోటార్లు, స్టార్టర్లు, పైపులను రైతులకు ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. బద్వేలు నియోజకవర్గంలోని రైతులకు అధిక ప్రయోజనం కల్పించేలా 329 జలకళ బోర్లు మంజూరయ్యాయన్నారు. జిల్లాలో 728 మంజూరు కాగా 50 శాతం పైనే ఇక్కడి రైతులకే దక్కాయన్నారు. రైతులకు అధిక ప్రయోజనం కలిగేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు చేపట్టారన్నారు. డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 137 మంది రైతులకు బోర్లు వేసిన తరువాత మోటార్లు, ఇతర సామగ్రి అందజేయగా అందులో 60 శాతం పైనే 79 మంది రైతులు బద్వేలు నియోజకవర్గంలోని మండలాలకు చెందిన వారే ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి రైతాంగానికి మేలు కలిగేలా అధిక బోర్లు వేసేందుకు కృషి చేశారన్నారు. పంచాయతీ రాజ్ సలహదారు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ జగనన్న పలు సంక్షేమాలతో పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ఆయన్ను మళ్లీ సీఎం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు సీ బాషా, చెన్నురాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, వెంగళరెడ్డి, సర్పంచ్‌లు కల్లూరు రమణారెడ్డి, రఘునాథరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఎపీడీ శ్రీనివాసరావు, ఈసీ ఖాజా గరీబ్, తదితరులు పాల్గొన్నారు.

అమృతానగర్ సమస్యలను పరిష్కరిస్తాం



తాగునీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : పంచాయతీ పరిధిలోని అమృతానగర్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక సమస్యలపై ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్ రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన సర్పంచ్‌తోపాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి గురుమోహన్ శుక్రవారం అమృతానగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. ప్రజలు నడిచేందుకు ఇబ్బంది లేకుండా అన్ని వీధుల్లో వీధి లైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సచివాలయ సిబ్బంది, ఇన్సాఫ్ నాయకులు బాషా, ప్రతాప్, మున్నా, విజయ్ పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం శుభ్రత వారం కావాలి



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న సుబ్బరాజ

రాజుపాళెం : ప్రజలందరూ ప్రతి శుక్రవారం శుభ్రత వారంగా పాటించాలని మలేరియా యూనిట్ అధికారి బి.సుబ్బరాజ పేర్కొన్నారు. మండలంలోని పగిడేల గ్రామంలో దోమల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రజలు తమ ఇంటి పరిసరాలను, లోపల శుభ్రం చేసుకోవాలని చెప్పారు. దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీహెచ్‌ఈఓ శివశంకర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చుక్కల భూములపై సంపూర్ణ హక్కులు

- దశాబ్దాల సమస్యకు ప్రభుత్వం పరిష్కారం
- ప్రొద్దుటూరు మండలంలో 906 మంది రైతులకు లబ్ధి

ప్రొద్దుటూరు : చుక్కల భూముల సమస్యకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. ఏళ్ల తరబడి రైతులు మండల రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పరిస్థితికి బ్రేక్ పడింది. ప్రభుత్వం చూపిన చొరవతో ప్రొద్దుటూరు మండలంలో 906 మంది రైతులు లబ్ధి పొందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. 22ఏ జాబితా కింద నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములపై రైతులకు హక్కులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యతో రైతులు ఇంత కాలంగా తీవ్రంగా నష్టపోయారు. భూమి తానే సాగు చేసుకుంటున్నా అవసరం వచ్చినప్పుడు అమ్మడానికి వీలులేని పరిస్థితి ఉండేది. దీంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపగా ఆమోదం తెలిపింది. ప్రొద్దుటూరు మండల పరిధిలోని గోపవరం గ్రామంలో 0.34 ఎకరాలు, ఉప్పరపల్లె గ్రామంలో 37.125 ఎకరాలు, పెద్దశెట్టిపల్లెలో 24.89 ఎకరాలు, బొల్లవరంలో 34.043 ఎకరాలు, రామేశ్వరంలో 31.49 ఎకరాలు, కామనూరులో 190.26 ఎకరాలు, దొరసానిపల్లెలో 89.88 ఎకరాలు, కొత్తపల్లెలో 165.9 ఎకరాలు, ప్రొద్దుటూరులో 180.202 ఎకరాలు, కల్లూరులో 114.66 ఎకరాలు, మోడంమీద పల్లెలో 46.15 ఎకరాలు, తాళ్లమాపురంలో 226.51 ఎకరాలు కలిపి మొత్తం మండలంలోని 1028 సర్వే నంబర్లకు సంబంధించి 1141.45 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. తద్వారా 906 మంది రైతులకు లబ్ధి చేకూరింది.

ఏబీవీపీ ఆధ్వర్యంలో మోడల్ పరీక్ష


కడప ఎడ్యుకేషన్: అఖిల భారత విద్యార్థి పరిషత్తు (ఏబీవీపీ) ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగరంలో మోడల్ ఎంసెట్ పరీక్షను నిర్వహించారు. ఇందుకు సంబంధించిన మోడల్ ఎంసెట్ ప్రశ్నపత్రాన్ని కడప డీఎస్పీ షరీఫ్ చేతుల మీదుగా విడుదల చేసి విద్యార్థులకు అందచేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విభాగ కన్వీనర్ కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఈ నెల 15వ తేదీ నుంచి ఎంసెట్‌పరీక్షలు రాయబోతున్నారన్నారు. ఈ తరుణంలో విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షా రాయాలనే ఉద్దేశ్యంతో ఏబీవీపీ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ పరీక్ష నిర్వహించామన్నారు. ఈ పరీక్షకు నగరంలోని దాదాపు 100 మంది విద్యార్థులు హాజరయారన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మంజూనాధరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే!


కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు. భక్తులు విశేష సంఖ్యలో కల్యాణోత్సవానికి హాజరయ్యారు. కల్యాణం అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. కనుల పండువైన అలంకారంలో ఉన్న స్వామి, అమ్మవార్లను తిలకించిన భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అర్చకులు వారికి మంగళ హారతులు ఇచ్చారు.

- కడప నగర పరిధిలోని ఆలంఖాన్‌పల్లె వద్దగల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం కల్యాణోత్సవానికి హాజరు కావడం పవిత్ర కార్యక్రమంగా భావించిన స్థానిక భక్తులు విశేష సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు క్రమంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.


సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



మంచి మార్కులు సాధించిన వెంకటేశ్వర డిగ్రీకళాశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వేదవ్యాస డిగ్రీకళాశాల యాజమాన్యం



విద్యార్థులను అభినందిస్తున్న రాణితిరుమల దేవి డిగ్రీకళాశాల యాజమాన్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఇటీవల యోగి వేమన యూనివర్సిటీ విడుదల చేసిన సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ కనబరచారు. స్థానిక శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు మొదటి సెమిస్టర్ బీఎస్సీ (బీజెడ్‌సీ)లో రెహానా 9.80 జీపీఏ, షబానా 9.6, సునీల్‌కుమార్ 9.4, రాణి 9.4, రుబీనా 9.3, మానస 9.1, ఎంఎస్‌సీఎస్‌లో సులోచన 8.6, సుష్మ 8.5, బీకాంలో ధనశ్రీ 8.9, యాసిన్ 8.5, బీబీఏలో సానా 8.3 సాధించారు. డిగ్రీ మూడవ సెమిస్టర్ బీఎస్సీ ఎంఎస్‌సీఎస్‌లో మహీన్ 9.5, ఎంపీసీఎస్‌లో లావణ్య 9.3, అరుణ 9.2, బీజెడ్‌సీలో నాగసౌమ్య 9.3, సఫియా 9.2, అఫ్రిన్ 9.1, బీకాంలో సభాఖనమ్ 8.3, రాఘవేంద్ర 8.3, పూజిత 8.3 జీపీఏ సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ , ప్రిన్సిపాల్ మహమ్మద్ ముస్తఫా, వైస్‌ప్రిన్సిపాల్ శారదా భవాని అభినందించారు.

వేదవ్యాస డిగ్రీకళాశాల..

స్థానిక నెహ్రూరోడ్డులోని వేదవ్యాస డిగ్రీకళాశాల విద్యార్థులు మొదటి సెమిస్టర్‌ఎంపీసీఎస్ విభాగంలో అహమద్ 9.6, నాగసుస్మిత 9.5, ఎంఎస్‌సీఎస్‌లో లావణ్య 9.3, అల్తాఫ్ 9.1, బీకాంలో వినీత 8.9, వెంకటమ్మ 8,8, నసీరాభాను 8.8, మూడవ సెమిస్టర్ ఎంపీసీఎస్ విభాగంలో అర్చన 9.3, గాయత్రి 9.1, ఎంఎస్‌సీఎస్‌లో భవాని 9.3, దీక్షిత 9.0, బీకాంలో హర్షిత 8.7, లిఖితారెడ్డి 8.5జీపీఏ సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి, ప్రెసిడెంట్ సుదర్శనరెడ్డి, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజు, అధ్యాపకులు అభినందించారు.

లేపాక్షి డిగ్రీకళాశాల..

స్థానిక లేపాక్షి డిగ్రీకళాశాల విద్యార్థులు మొదటి సెమిస్టర్ బీకాంలో చంద్రకళ 9.0, జీవరత్న 8.8, ఎంపీసీఎస్‌లో తేజస్వి 9.4, రాజు 8.3, ఎంఎస్‌సీఎస్‌లో భారతీలక్ష్మి 9.6, నరసింహ 9.3, రెండవ సంవత్సరం మూడవ సెమిస్టర్ బీకాంలో అఖిల 8.7, కరిష్మా 8.6, హితైషిని 8.6, ఎంపీసీఎస్‌లో సౌభాగ్య 9.3, అనూష 9.2, ఎంఎస్‌సీఎస్‌లో హరిత 8.7, హైమావతి 8.6 జీపీఏ సాధించారు. వీరిని కరస్పాండెంట్ రామచంద్రారెడ్డి, కరస్పాండెంట్ రాఘవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

రాణీతిరుమలదేవి డిగ్రీకళాశాల..

స్థానిక రాణీతిరుమల దేవి డిగ్రీకళాశాల బయోటెక్ ద్వితీయ సంవత్సరం మూడవ సెమిస్టర్‌లో నస్రీన్ 9.9, ప్రవీణబాయి 9.0, మొదటి సంవత్సరంలో మొదటి సెమిస్టర్‌లో రోషన్ 9.6, ఫిరదౌస్ 9.5, ద్వితీయ సంవత్సరం ఎంఎస్‌సీఎస్‌లో మూడవ సెమిస్టర్ తజఖియా ఖనమ్ 9.2, తబసున్ 9.1, నౌరిన్‌తాజ్ 9.1, బీకాం మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ చంద్రకళ 8.2, మహీన్ 8.2, బీకాం ద్వితీయ సంవత్సరం మూడవ సెమిస్టర్ శ్రీలక్ష్మి 8.6, ముస్కన్ 8.1 జీపీఏ సాధించారు. వీరిని కరస్పాండెంట్ తరుణేందు శేఖర్, ప్రిన్సిపాల్ చంద్రశేఖరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజి విద్యార్థుల ప్రతిభ

మైదుకూరు : యోగివేమన విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్ ఫలితాల్లో మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కాలేజి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్టు కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ తమ కాలేజి బీఎస్సీ (బీజెడ్‌సీ) విద్యార్థులు పి.ఆయేషా 9.91 జీపీఏ, ఎస్.స్వరూప 9.57 జీపీఏతో యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ప్రతిభను చూపినట్టు తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు సుభాన్‌సాహెబ్, రాధారామ్, సుబ్బరాయుడు, వెంకటరామిరెడ్డి అభినందించారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

జమ్మలమడుగు : పట్టణంలోని పతంగేరామన్న రావు క్రీడా మైదానంలో ఎద్దుల పోటీలు రసవత్తరంగా సాగాయి. నారాపురవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం ఆరుపళ్ల ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. శనివారం ఉదయం సీనియర్ ఎద్దుల పోటీలు జరుగుతాయన్నారు. రైతులకు, వచ్చినవారికి వైఎస్సార్‌సీపీ నాయకుడు హృషికేశవరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆత్మబంధువుకు అంతిమ సంస్కారం

కడప అర్బన్: నగరంలోని బాలాజీనగర్ రోడ్ నెంబర్.12లో ధనలక్ష్మి (70) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు బంధువులు ఎవరూ లేకపోవడంతో కడప తాలూకా పోలీసులు మేముసైతం సేవాసంస్థ వారిని అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. దీంతో వారు హిందూ సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలు నిర్వహించారు.సంస్థ ప్రధాన కార్యదర్శి గుండ్లకొండ రవి, వంకధారి రాము, రెడ్డెయ్య, దామోదరం పాల్గొన్నారు.